అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
ఆదివారం 12 మార్చి 2023

విద్యుద్ఘాతంతో మహిళ మృతి

నవతెలంగాణ-కోటపల్లి



చెన్నూర్ మండలంలోని ఒత్కులపల్లి గ్రామానికి చెందిన కోగిలి సమ్మక్క(45) అనే మహిళ శనివారం రాత్రి విద్యుత్ షాక్‌కి గురై మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సమ్మక్క టీవీ అన్ చేయడానికి ప్లాగ్‌లో పిన్ పెడుతున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త మల్లయ్యతో పాటు కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని ఏళ్లక్కపేటలోని చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ సూర్య ప్రకాష్ పేర్కొన్నారు.

ఆసిఫాబాద్ అటవీశాఖ అధికారిగా నీరజ్ కుమార్ టిబ్రేవాల్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారిగా నీరజ్ కుమార్ టిబ్రేవాల్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎల్లందు ఎఫ్‌డీఓగా పని చేస్తూ బదిలీపై కుమరంభీం జిల్లా డీఎఫ్ఒగా ఫిబ్రవరి 10న బదిలీ అయ్యారు. ఆదివారం బాధ్యతలు స్వీకరించిన అటవీ శాఖ అధికారిని జిల్లాలోని ఎఫ్డిఓ ఎఫ్ఆర్‌ఓలు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా అధికారికి వారు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ ఎఫ్‌డీఓ విజయ్ కుమార్, జిల్లాలోని వివిధ రేంజ్ ఆఫీసర్‌లు అప్పలకొండ, మజారుద్దీన్, దయాకర్, పూర్ణచందర్, రాంబాబు, సంతోష్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

అపూర్వం పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-దండేపల్లి

మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992-1993 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 30 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరిన వారిలో ఆనందం పెల్లుబికింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో పాఠశాలలో చదివిన మరుపురాని తీపి గుర్తులు నెమరేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఎవరెవరు ఎక్కడెక్కడ స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి చదువు చెప్పిన గురువులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానంలో గౌరవాన్ని పొందినప్పుడే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందని, విద్యార్థుల ఉన్నతిని తెలుపుతుంటే చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. గురువులు చూపించిన సన్మార్గంలో నడిచి ప్రస్తుతం ప్రతి విద్యార్థి వివిధ వృత్తుల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరం పడటం ఆనందం కల్గిస్తుందని అన్నారు. అనంతరం గురువులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

గౌడ కులస్తులకు ప్రభుత్వం అండగా నిలవాలి

నవతెలంగాణ-జన్నారం

గౌడ కులస్తులకు ప్రభుత్వం అండగా నిలవాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాలస్వామి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో తెలంగాణ గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ గౌడ జాతి సమస్యలపై పోరాడేందుకు మోకు దెబ్బ ఏప్పుడు సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఓ ల్లాల నరసగౌడ్ మోకు దేబ్బ పట్టణ అధ్యక్షుడు పోడేటి సతీష్ గౌడ్, ఒల్లాల వెంకటేష్‌గౌడ్, గొల్లపల్లి రమేష్ గౌడ్, ఎరుకల శంకర్ గౌడ్, ఎరుకల రవి గౌడ్, నరేష్ గౌడ్ పాల్గొన్నారు.

నేటి చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ 4 నెలల జీతాలు ఇవ్వాలని, జీఓ నెం.11, 60లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్వహించే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు సురేష్, బాలేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిమాండ్ల పరిష్కార కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని సమస్యలు పరిష్కారం కాని యెడల సమ్మెకు వెళ్లనున్నట్లు హెచ్చరించారు.

మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

నవతెలంగాణ-జన్నారం

మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఎంపీపీ మాదాడి సరోజన రవీందర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోనీ రామాలయంవాడలో మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలను గౌరవించి ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జిల్లా ఐద్వా అధ్యక్షురాలు పోతు విజయశంకర్‌ను శాలువా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) కార్యదర్శి సంకె రవి, మహిళా నాయకులు రాజేశ్వరి, పి.విజయ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖేలో ఇండియా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆదివారం జిల్లా స్థాయి ఖేలో ఇండియా ఉమెన్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రాజేష్ తో కలిసి జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీల్లో రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి ఈ నెల 19న హైదరాబాదులోని ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ అథ్లెటిక్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. క్రీడాకారిణులు మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెటా సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.స్వామి, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జ్యోతిశ్వరన్, పీఈటీలు వీజి ఎస్ రాకేష్, నర్సమ్మ, ప్రియాంకరెడ్డి, మజీద్ పాల్గొన్నారు.

గ్రామాల భివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



నవతెలంగాణ-ముథోల్

తెలంగాణ ప్రభుత్వం గ్రామాల భివృద్ధికి పెద్ద పీట వేస్తోందని ముథోల్ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సుమారు రూ.కోటి నలభై లక్షలతో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణలపనులకు ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో నెలకొన్న సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అన్ని వర్గాల అభివృద్ధికి పాటుపడుతుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, సర్పంచ్ రాజేందర్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పోతన్న యాదవ్, రోళ్ల రమేష్, మగ్దుమ్ పాల్గొన్నారు.

బోర్లు వేశారు.. మోటార్లు మరిచారు..!

- సిర్పూర్(యు) మండలకేంద్రంలో నీటి సమస్య
- బజార్‌వాడీలో అందని మిషన్ భగీరథ నీరు
- ఆందోళనకు సిద్ధమవుతున్న గిరిజనులు

నవతెలంగాణ-జైనూర్



రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటింటికి శుద్ధ నీరు అందిస్తామని పదేపదే చెపుతున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలు మండలాల్లో నీటి సరఫరా కావడం ప్రశ్నార్థకంగా మారింది. సిర్పూర్(యు) మండలకేంద్రంలోని బజార్‌వాడీ కాలనీలో గిరిజనులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. మండలకేంద్రంలో అధికారులు ఉన్నా కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఎంపీడీఓ కార్యాలయం పక్కనే ఉన్న కాలనీలో నీరు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని గిరిజనులు వాపోతున్నారు. రాబోయే రోజుల్లో తీవ్రమైన ఎండ ఉంటే నీటి సమస్య ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. గతంలో ఎన్నోసార్లు అధికారులకు విన్నవించిన కూడా పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ ట్యాంకు ఉన్నా కొన్ని ప్రాంతాల్లో మాత్రమే నీటి సరఫరా కావడంతో మిగితా ప్రాంతాల ప్రజలు నీటి ఎద్దడిని ఎదుర్కొవాల్సి వస్తోంది.

అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు



మండలకేంద్రంలోని ప్రతి కాలనీకి నీరు అందించడంలేదని, తీవ్ర కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బజార్‌వాడీ ప్రజలు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేరుకే అధికారులు ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇస్తామని చెప్పి కేవలం మండలకేంద్రంలోనే ఇలాంటి పరిస్థితి ఉందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. సిర్పూర్(యు) మండలకేంద్రంలో నీటి సమస్య ఉందని ప్రజలు గతంలో ఎన్నోసార్లు అధికారులకు మొరపెట్టుకున్న సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. బజార్‌వాడీ ప్రాంతంలో సుమారు మూడు బోర్లు వేయించారు. మూడు బోర్లలో ఆ కాలనీకి సరఫరా అయ్యే నీరు కూడా వస్తుంది. కానీ మూడు బోర్లు వేయించి కూడా అధికారుల నిర్లక్ష్యం వల్ల బోర్లకు కనీసం మోటార్లు, స్టాటర్లు వేయిస్తే కాలనీవాసులకు, ఆ ప్రాంతంలోని ప్రజలకు నీటి సమస్యకు ఇబ్బంది ఉండదు. బోర్లు వేయించి సుమారు 11 నెలలు గడిచినా మోటార్లు బిగించడం లేదు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు తప్పా నీరు అందించడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మూడు బోర్లు వేసినా కూడా మోటార్లు లేకపోవడంతో డబ్బులు వృధాగా మారుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. గతంలో అధికారులకు విన్నవించిన కూడా మా సమస్యలను ఎందుకు పట్టించుకోవడంలేదని, మాకు నీరందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను కోరుతున్నారు.

వాటర్ ట్యాంకు ఉన్నా ఉపయోగం సున్నా

సిర్పూర్(యు) మండలకేంద్రంలో మిషన్ భగీరథ కింద నూతనంగా వాటర్‌ట్యాంకు నిర్మించారు. ఈ వాటర్‌ట్యాంకు ద్వారా మండలకేంద్రంలోని పలు కాలనీలకు నీరు అందిస్తున్నారు. కానీ మండలకేంద్రంలోని బజార్‌వాడీ కాలనీలో మాత్రం నీటిని అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్ పూర్తిచేసి నీరు అందించడానికి అధికారులు ప్రయత్నం చేస్తే కాలనీలో నీరు సరఫరా అవుతుందని తెలిపారు. మండలకేంద్రంలో బోర్లు వేసిన మోటారు లేకపోవడం, మిషన్ భగీరథ వాటర్‌ట్యాంకు ఉండి కూడా నల్లా ద్వారా నీరు రాకపోవడంతో మండలకేంద్రంలోనే ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోతున్నారు. కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేస్తే కేవలం ఆ బోరు దగ్గరికి వెళ్లి త్వరలోనే కొత్త మోటార్లు వేయిస్తామని ఫోటోలు తీసి వెళ్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

దాతలు చేసిన సాయంతోనే నీటి సరఫరా

సిర్పూర్(యు) మండలకేంద్రంలోని బజార్‌వాడీ కాలనీలో గతేడాది ఔట్రిచ్ మ్యాప్ అనే ఓ సొసైటీ తరపున మండలకేంద్రంలో నూతన బోరు వేయించారు. ఈ బోరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 2021లో బోరు వేశారు. బోరుకు మోటారు బిగించడంతో మండలకేంద్రంలోని బజార్‌వాడీ కాలనీవాసులు అక్కడికి వెళ్లి నీటిని తీసుకొస్తున్నారు. గతేడాది దాత సహాయంతోనే కాలనీవాసులకు నీరు అందించడంతో అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలకేంద్రంలో ప్రభుత్వం ద్వారా సరఫరా చేసే నీటి సమస్య పరిష్కారం కాకపోవడం బాధాకరం. ఔట్రిచ్ మ్యాప్ సొసైటీ ఆధ్వర్యంలో వేసిన బోరు, మోటారు సాయంతోనే మండల ప్రజలకు నీరు అందిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. వాటర్ ట్యాంకు నిర్మించి ఇంటింటి నల్లా కనెక్షన్లు బిగించినా నీటి సరఫరా కాకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వేరే ప్రాంతాల నుండి నీటిని తీసుకొస్తున్నాం



-ఆత్రం తుక్కుబాయి, కాలనీవాసి

మండలకేంద్రంలో నీటి సమస్య ఉండడంతో బజార్‌వాడీ కాలనీలో నివసిస్తున్న వారు వేరే ప్రాంతానికి వెళ్లి నీటిని తెచ్చుకోవడం బాధాకరం. రోజూవారీగా ఉదయం సమయంలో మండలకేంద్రంలోనే వేరే కాలనీకి వెళ్లి ఇంటి అవసరాలకు, ఇతర అవసరాలకు నీటిని తెచ్చుకుంటున్నాం. కనీసం మిషన్ భగీరథ లేదా ఏర్పాటుచేసిన బోర్లకు మోటార్లు బిగించి మా సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరుతున్నాం.

సమస్యలు పరిష్కరించాలి



మారుతి, బజార్‌వాడీ కాలనీవాసి

మండలకేంద్రంలోని బజార్‌వాడీలో తీవ్రమైన నీటి సమస్య ఉందని గతంలో ఎన్నోసార్లు అధికారులకువినతిపత్రాలు అందజేసిన కూడా అధికారులు పట్టించుకోవడంలేదు. తమకు నీటి సమస్య పరిష్కరించి మండలకేంద్రంలోని మూడు బోర్లకు మోటార్లు బిగించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం. మండలకేంద్రంలో నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు విన్నవిస్తున్నాం.

మండలకేంద్రంలో ఇలాంటి పరిస్థితి దారుణం

ఆడె వెంకటేష్, ఆదివాసీ నాయకుడు



సిర్పూర్(యు) మండలకేంద్రంలోని బజార్‌వాడీ కాలనీలో తీవ్ర నీటి సమస్య ఉంది. మూడు బోర్లు వేయించి సుమారు 11 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు బోర్లకు మోటార్లు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. గ్రామ పంచాయతీ అధికారులు, మండలాభివృద్ధి అధికారి దీనిపై స్పందించి కనీసం వేసిన బోర్లకు మోటార్లు బిగిస్తే మండలకేంద్రంలోని ప్రజలకు న్యాయం జరుగుతుంది. నీటి సమస్యను పరిష్కరించని యెడల రాబోయే రోజుల్లో కాలనీవాసులతో కలిసి ధర్నా నిర్వహిస్తాం.

పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

నవతెలంగాణ-మంచిర్యాల



జిల్లాలోని విద్యార్థిని విద్యార్థులు పట్టుదలతో చదివి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి.మధుసూదన్ నాయక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల, సాయి కుంటలోని బీసీ బాలుర వసతిగృహం, ఎస్సీ బాలుర వసతిగృహం, ఎస్సీ బాలుర వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడారు. ఫలితాలలో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనిపై చదువులు అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థిని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వసతి గృహంలోని విద్యార్థుల గదులు, పరిసరాలు, వంటశాలలు, మూత్రశాలలు పరిశుభ్రంగా ఉండే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఎస్సీ కళాశాల వసతి గృహంలో నెలకొన్న అపరిశుభ్ర పరిస్థితులపై వార్డెన్ సిహెచ్.కుమారస్వామికి షోకాస్ నోటీస్ జారీ చేయాలని షెడ్యూల్డ్ కులాల అభివద్ధి శాఖ ఉపసంచాలకులు పి.రవీందర్ రెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.సుమతి పాల్గొన్నారు.

నేడు సమస్యల పరిష్కారానికి చలో కలెక్టరేట్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి పెరిక శ్రీకాంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రామపంచాయతీలో వివిధ కేటగిరిలో పనిచేస్తున్న కార్మికులకు 4 నుండి 6 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీనితో కుటుంబాల పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పంచాయతీ కార్మికుల వేతనాలు రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కారోబార్లకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. జిల్లా నుండి పెద్ద ఎత్తున కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజేందర్ పాల్గొన్నారు.

లాభాలు సాధించడానికి ప్రణాళికవేయాలి



నవతెలంగాణ-నస్పూర్

ఉత్పత్తి వేయాన్ని తగ్గించుకొని లాభాలను సాధించడానికి తగిన ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు వెళ్లాలని ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో డైరెక్టర్, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని భూగర్భ గనులలో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో సాధించవలసిన ఉత్పత్తి లక్ష్యాలు, భూగర్భ గనులలో ఖర్చులను తగ్గించుకోవాల్సిన ఆవశ్యకతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకత సాధించాలని, రోజువారి ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ, బొగ్గు రవాణా చేయాలని, అలాగే ఆయా గనుల పురోగతిని ఆయా గనుల ఏజెంట్లు, మేనేజర్లతో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సమీక్ష సమావేశం తర్వాత డైరెక్టర్, జనరల్ మేనేజర్ కలసి శ్రీరాంపూర్ ఉపరితల గనిలో ఓబి కాంట్రాక్టు కంపెనీ గౌరవ్, చల్ల రఘుపతి రెడ్డి వారితో మాట్లాడుతూ తమ రోజువారి ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ఓబి ఎంత ఎక్కువ తీస్తే అంత ఎక్కువ బొగ్గు తీయడానికి అవకాశం ఉందని అన్నారు. ఓబి ఎక్కువ తీయాలని రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలు సాధనలో తమ వంతు భూమిక పోషించాలని సూచించారు. రాబోవు ఆర్థిక సంవత్సరంలో సంస్థ పురోగతిలో ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ఏజెంట్లు గోపాల్ సింగ్, ఏవీ రెడ్డి, సత్యనారాయణ, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ పురుషోత్తమరెడ్డి, మేనేజర్ జె.సుధీర్, డీజీఎం ఐఈడీ కె.చిరంజీవులు, ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కేజీబీవిలో వసతులపై ఎమ్మెల్యే ఆగ్రహం

నవతెలంగాణ-వేమనపల్లి



మండలంలోని నీల్వాయి కేజీబీవి పాఠశాలను బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు వృద్ధిలోకి రావాలని సూచించారు. పాఠశాలలో వసతులు సరిగ్గా లేవని ఆగ్రహం వ్యక్తం చేసారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు బీఆర్ఎస్ నాయకులు భీమా గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్



తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ తొమ్మిదవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సునారికారి రాజేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలు 13,14తేదీలలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రావిడెంట్ ఫండ్, బోనస్, గ్రాట్యుటీ, కరువు భత్యం, విడిఏ, కనీస వేతనాలు పెంపుదలకై బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పోరాడి సాదించుకున్నాం అన్నారు. రాష్ట్రంలో ఎన్నికలలో వాగ్దానం చేసిన జీవనభృతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కోటిన్నర మందికి ఉపాధి కల్పిస్తుందని అన్నారు. పరిశ్రమనే అయినప్పటికీ దీనిపై కోప్టా చట్టం జీఎస్టీలతో కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాసే వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. బీడీ కార్మికుల హక్కుల కోసం ఈ మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్టు పేర్కొన్నారు. ఈ మహాసభలకు బీడీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ బీడి వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) అనుబంధం జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య విలాస్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం లింగన్న పాల్గొన్నారు.

సీఓఈ ప్రవేశ పరీక్షకు 117 మంది గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎజోఈ)లో వచ్చే విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ఆర్సీఓ వి. గంగాధర్ తెలిపారు. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో మొత్తం 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. బైపీసీ, ఎంపీసీలో ప్రవేశాల కోసం 2,242 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. అందులో 2,065 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 117 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రతిభ ఆధరంగానే సీట్లు కేటాయించడం జరుగుతుందని ఆర్సీఓ పేర్కొన్నారు.

అమ్మవారి సన్నిధిలో అదిలాబాద్ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-బాసర

సరస్వతి దేవి అమ్మవారి సన్నిధిలో ఆదివారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న వీరిని ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో ఎమ్మెల్యే జోగు రామన్న తన మనవరాలికి అక్షరాభ్యాస పూజలు జరిపించి, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు హారతినిచ్చి ఆశీర్వదించారు. ఆలయ ఈఓ విజయరామారావు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. వీరి వెంట స్థానిక నాయకులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆయిల్ ఫామ్ సాగుకు... అన్నదాత దూరం..!

- ఆర్థిక భారంతో విముఖత చూపుతున్న రైతులు
- అవగాహన లేమితో ఆదరణ కరువైతున్న వైనం

నవతెలంగాణ- నిర్మల్

రష్యా, ఉక్రెయిన్ యుద్ధంతో అంతర్జాతీయంగా ఆయిల్ ముడి సరకుల డిమాండ్ పెరిగింది. దిగుబడులు తగ్గిపోవడంతో దేశంతో పాటు రాష్ట్రంలో ఆయిల్ ముడి సరుకుల ఆవశ్యకత పెరిగింది. ఇందులో భాగంగా ప్రభుత్వాలు ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచి ముడి సరుకుల లోటను భర్తీ చేయాలని ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ దిశగా సాగు విస్తీర్ణం పెంచడం, రైతులు ఎక్కువ శాతం సాగు చేసేలా రాయితీలు ఇవ్వడం, ఇతర సౌకర్యాలు కల్పించడం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారీగా ఆయిల్ ఫామ్ సాగుపై లక్ష్యాలను నిర్దేశించింది. అయితే ఆయిల్ ఫామ్ సాగుకు ఖర్చులు ఎక్కువ కావడం, పంట సాగు వ్యవధికాలం ఎక్కువగా ఉండటం, చిన్న, సన్నకారు రైతులకు ఆర్థిక భారం కావడంతో ఈ ఆయిల్ పామ్ సాగు పట్ల అన్నదాతలు అయిష్టత చూపిస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో లక్ష ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగును చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. ఆ దిశగా ఈ ఏడాది 16,867 ఎకరాల్లో పంట సాగు చేయాలని నిర్ణయించింది. సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేసింది. నిర్మల్ జిల్లాలో సారంగాపూర్ మండలంలో, ఆదిలాబాద్ జిల్లాలో భరంపూర్, మంచిర్యాల జిల్లాలో జైపూర్ మండలాల్లో రైతులకు ఆయిల్ ఫామ్ మొక్కలు ఇచ్చేందుకు నర్సరీలు ఏర్పాటు చేసింది.

లక్ష్యం చేరని సాగు..!

ఉమ్మడి జిల్లాలో లక్ష ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. మొదటగా 2022-23 ఖరీఫ్, యాసంగికి గాను ప్రభుత్వం 16,867 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. నిర్మల్ జిల్లాలో ఖరీఫ్‌లో 3 వేల ఎకరాలు లక్ష్యం కాగా.. 2050 ఎకరాల్లో సాగైంది. యాసంగిలో 7 వేల ఎకరాల లక్ష్యం కాగా 4,200 ఎకరాల్లో, ఆదిలాబాద్ జిల్లాలో ఖరీఫ్‌లో 1200 ఎకరాలు లక్ష్యం కాగా వెయ్యి ఎకరాల్లో, యాసంగిలో 2200 ఎకరాలు లక్ష్యం కాగా 1800 ఎకరాల్లో సాగైంది. మంచిర్యాల జిల్లాలో ఖరీఫ్ 222 ఎకరాల లక్ష్యం కాగా, లక్ష్యం మేరకు సాగైంది. యాసంగిలో 2,200 ఎకరాల లక్ష్యం కాగా, 950 ఎకరాల్లో సాగైంది. కుమురం భీం జిల్లాలో ఖరీఫ్‌లో 95 ఎకరాలు లక్ష్యం కాగా లక్ష్యం మేరకు సాగైంది. యాసంగిలో 950 ఎకరాలకు 430 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు అయింది. నిర్దేశించిన లక్ష్యం ఒకలాగా ఉంటే పెట్టుకున్న సాగు లక్ష్యం తక్కువగా ఉంది. ఇందులో సాగు అయ్యింది మరింత తక్కువగా ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి.



ఆర్థిక భారం కావడంతో రైతులు విముఖత..

ఆయిల్ ఫామ్ సాగుకు ఎకరానికి 50 మొక్కల పైన అవసరం ఉంటుంది. ఒక్కో మొక్క ధర మార్కెట్‌లో రూ.193 కాగా, ప్రభుత్వం రూ.173 రాయితీ ఇస్తుంది. దీంతో రైతులు ఒక్కో మొక్కకు రూ. 20 చెల్లించాల్సి ఉంటుంది. సాగులో భాగంగా ఒక మొక్క నాటడం కోసం రెండడుగులు లోతు, వెడల్పుగా గుంతలు తవ్వాల్సి ఉంటుంది. ఈ గుంతలు తవ్వడానికి గుంతకు రూ. వంద ఖర్చవుతుంది. 50 గుంతలకు గాను సుమారు రూ. 5 వేలు ఖర్చవుతుంది. బిందు సేద్యం పరికరాలు, వాటిని అమర్చడం, ఎరువులు, మందులు, మొక్కల సంరక్షణ, నర్సరీల నుండి మొక్కలకు అయ్యే రవాణా ఖర్చులు, కలుపు తీయడం ఇలా సుమారు ఎకరానికి రూ. 20 వేల నుండి రూ.30 వేల వరకు ఖర్చు రైతులపై ఆర్థిక భారం పడుతుంది. ఇది ఇలా ఉండగా పంట సాగు కాలం నాలుగు ఏండ్లు సుదీర్ఘంగా ఉండటం, ఈ సమయంలో చీడ, పీడ పురుగుల బాధ, అతివృష్టి, అనావృష్టి, మార్కెట్ లో డిమాండ్, గిట్టుబాటు ధరలపై పలు అనుమానాలు ఉండటంతో రైతులు ఆయిల్ ఫామ్ పంట సాగు చేయడంపై విముఖత చూపుతున్నారు.

అవగాహన లేమితో ఆదరణ కరువు...

రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది. సాగు కోసం రైతులకు మొక్కలు, రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తుంది. గుంతలు తవ్వడానికి, ఇతరత్రా పనులకు ఉపాధిహామీ పనులను అనుసంధానం చేస్తోంది. ఎక్కువ శాతం సాగు అయ్యేలా ప్రణాళికలు రూపొందించి, లక్ష్యాలను నిర్దేశిస్తుంది. అయినప్పటికీ ఆ దిశగా క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించక పోవడం, దీర్ఘకాలిక పంట సాగు ఫలాలు, అంతర పంటల సాగుపై అర్థమయ్యేలా రైతులకు సంబంధిత అధికారులతో తెలియజేయకపోవడంతో ఆయిల్ ఫామ్ సాగుకు ఆదరణ కరువు అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పేద ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

పేద ప్రజల సంక్షేమాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని న్యూలోలం నుండి దిలావర్‌పూర్ తండా వరకు రూ.2కోట్ల 85లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులకు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని, రైతుల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తుందని తెలియజేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి ఆడపడుచులకు గొప్ప వరమని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితులకు దళితబంధు పథకాన్ని ప్రారంభించి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తుందని అన్నారు. ఈ దఫా నిర్మల్ జిల్లాలో పదకొండు వందల మందికి దళితబంధు ఇవ్వాలని నిర్ణయించిందని, అందులో భాగంగా ఒక్కో దళితునికి పదిలక్షల రూపాయలు అందిస్తుందని పేర్కొన్నారు. ఇకనుంచి స్వంత ఇళ్ళ స్థలాలు ఉన్నవారికి ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వం తరఫున రూ.3లక్షలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. దళితబంధు ఇప్పిస్తాం, కళ్యాణ లక్ష్మి చెక్కులను మంజూరు చేయిస్తామని ఎవరైనా దళారులు డబ్బులు అడిగితే ఎవరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని అన్నారు. ఒకవేళ ఎవరైనా అడిగితే కలెక్టర్‌కు గాని, మంత్రికిగాని ఫోన్ చేసి ఫిర్యాదులు అందిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. మిషన్ భగీరథ నీరు ప్రతీ కుటుంబానికి అందుతున్నాయా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించబడుతుందని త్వరలోనే ఇక్కడ కూడా కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ దళితబంధు పథకాన్ని పకడ్బందీగా చేపడతామని అన్నారు. దళితబంధు ఇప్పిస్తామనే దళారుల మాటలకు మోసాలకు గురికావద్దని అన్నారు. నాలుగు లక్షల ఎకరాలకు పైగా పోడు భూములకు సంబంధించిన పట్టాలు కూడా త్వరలోనే చేపడుతామ తెలిపారు. అనంతరం దిలావర్‌పూర్ మండలాని చెందిన 19 మందికి, నర్సాపూర్(జి) మండలానికి చెందిన11 మందికి మొత్తం 30 కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్దిదారులకు మంత్రి ఐకే రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. న్యూలోలం గ్రామంలో తయారు చేసిన వర్మి కంపోస్టు ఎరువుల బస్తాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి, సర్పంచ్ ఒడ్నం సరితకృష్ణ, దిలావర్‌పూర్ ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, నర్సాపూర్ ఎంపీపీ కొంద్ర రేఖ రమేష్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దేవేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ రమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక రమణ, జెడ్పీకోఆప్షన్ సభ్యులు డాక్టర్ యు.సుభాష్ రావ్, ఎఫ్ఎస్సీఎస్ చైర్మెన్ ధర్మాజి రాజేందర్, సోన్ జెడ్పీటీసీ జీవన్ రెడ్డి, వైస్ ఎంపీపీ బాబురావ్, కాల్వ నరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మెన్ చిన్నయ్య, కదిలి పాపారేశ్వర ఆలయ చైర్మెన్ భుజంగ్ రావు, తహసీల్దార్లు కరీం, శ్రీకాంత్, దిలావర్‌పూర్, నర్సాపూర్ మండల సర్పంచులు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహనీయుని అడుగు జాడల్లో నడవాలి

- జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు



నవతెలంగాణ-నార్నూర్

ప్రతి ఒక్కరూ మహనీయుల అడుగు జాడల్లో నడిచి వారి ఆశయ సాధనకు కృషి చేయాలని అదిలాబాద్, ఆసిఫాబాద్ జెడ్పీ చైర్మెన్‌లు రాథోడ్ జనార్ధన్, కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్మించిన సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే విగ్రహా ఆవిష్కరణకు ముఖ్యఅతిథులుగా హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నాభావు సాఠే, బడుగు బలహీన వర్గాల కోసం ఎనలేని కృషి చేశారని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, మంచిగా చదివి మహనీయుని ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. విద్యా పరంగా సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. దళితుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. రెండో విడత దళితబంధును అందిస్తామని అన్నారు. సొంత ఇంటి స్థలం ఉన్న వారికి డబుల్ బెడ్ రూం కోసం రూ.3లక్షలు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఏజెన్సీ గ్రామంలో తరతరాలుగా నివసిస్తూ, భూమి కాస్తు చేస్తున్న దళిత రైతులకు పహనీలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కనక యాదవ్ రావ్, ఎంపీపీ కనక మోతుబాయి, పీఏసీఎస్ ఇన్‌చార్జీ చైర్మెన్ సురేష్ ఆడే, ఎఎంసీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావు, బీఆర్‌ఎస్ నాయకులు యూనూస్ అక్బాని, సర్పంచ్ గజానంద్ నాయక్, దళిత సంఘాల జిల్లా నాయకులు నర్సింగ్ మోరే, అన్నా భావు సాఠే కమిటీ జిల్లా అధ్యక్షుడు ఉద్ధవ్ కాంబ్లే, మండల కమిటీ అధ్యక్షుడు కోరాల మహేందర్, ఎంపీటీసీ పరమేశ్వర్ పాల్గొన్నారు.

అడెల్లి ఆలయానికి పోటెత్తిన భక్త జనం

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని సుప్రసిద్ధ అడెల్లి శ్రీ మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచే భక్తులు కోనేటి నీటితో స్నానాలు ఆచరించి, అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. జిల్లా నుంచే కాకుండా ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మహారాష్ట్రలోని నాగపూర్, హిమాయత్ నగర్, నాందేడ్, పర్భాని నుంచి భక్తులు వాహనాల్లో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మెన్ అయిటి చందు, ఇన్‌చార్జీ ఈఓ రంగు రవికిషన్ గౌడ్ అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఎస్సై కృష్ణా సాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బీజేపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని బీఆర్‌ఎస్ మహిళా నాయకులు హెచ్చరించారు. ఆదివారం బండి సంజయ్ వాఖ్యాలను తీవ్రంగా ఖండిస్తూ, బీఆర్‌ఎస్ మహిళా విభాగం, జాగృతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి మోడీ దిష్టిబొమ్మతో భారీ ర్యాలీ చేపట్టారు. చావు డప్పులతో నిరసన వ్యక్తం చేస్తూ దిష్టిబొమ్మను కలెక్టర్ చౌరస్తా వరకు ఊరేగించి, పీఎం మోడీ, బండి సంజయ్ దిష్టి బొమ్మను తగలబెట్టారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ మహిళలు మాట్లాడుతూ తమ పార్టీకి దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణచూసి మోడీ ప్రభుత్వం ఓర్వలేకే బూటకపు ఈడీ కేసులు బనాయిస్తోందని మండిపడ్డారు. కావాలనే తమ నాయకురాలు ఎమ్మెల్సీ కవితను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యమ కుటుంబంలో పుట్టి తెలంగాణ ఆత్మగౌరవంతో పాటు మహిళ ఆత్మగౌరవానికి పాటుపడిన వ్యక్తి కల్వకుంట్ల కవిత అని అలాంటి మహిళను బండి సంజయ్ ఒక మహిళా అని చూడకుండా అసభ్య పదజాలంతో మాట్లాడటం చూస్తే మహిళలపై ఆయనకున్న చిత్తశుద్ధి ఎలాంటిదో అర్థమవుతుందని అన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి లాంటి ఎందరో వీరనారీల స్ఫూర్తితో ఒక మహిళగా ఉండి ప్రపంచ దేశాలలో బతుకమ్మ పండగకు ఎంతో కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చారని అన్నారు. అలాంటి తమ నాయకురాలిని మహిళా దినోత్సవం రోజే బండి సంజయ్ ముద్దు పెట్టడం అనే వాఖ్యాలతో మాట్లాడటం చూసి యావత్ మహిళా సమాజం భయభ్రాంతులకు గురవుతోందన్నారు. మహిళలపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. బండి సంజయ్‌ను అరెస్టు చేసేంతవరకు మహిళల పక్షాన నిరసనలు, ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు స్వరూపరాణి, బోడగం మమత, జాగృతి నాయకులు రంగిని శ్రీనివాస్, గోలి శంకర్, పట్టణ అధ్యక్షులు అజయ్, అశ్రాఫ్, కౌన్సిలర్ చందా నర్సింగ్, యువజన విభాగ అధ్యక్షులు బుట్టి శివకుమార్, సాయి, ఇబ్రహీం, మహిళా నాయకులు పర్వీన్, సుల్తానా, కస్తాల ప్రేమల, అనసూయ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బీజేపీ మోసపూరిత పార్టీ అని, తమ బీఆర్‌ఎస్ పార్టీ అభివృద్ధి చేసే పార్టీ అని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. అందుకే పలువురు నాయకులు స్వచ్ఛందంగా అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఆదివారం పట్టణంలోని సంజయ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ చేరికల కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ బడాల సుజాత కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆమెతోపాటు పలువురు కాంగ్రెస్ ముఖ్యనాయకులు, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే జోగు రామన్న నాయకత్వాన్ని బలపరుస్తూ బీఆర్‌ఎస్‌లో చేరారు అని అన్నారు. వారికీ ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు సంజయ్‌నగర్ కాలనీవాసులు ఘనస్వాగతం పలికారు. ముందుగా కాలనీలో రూ.30 లక్షలతో డ్రైనేజీ, సీసీరోడ్డు పనులకు కౌన్సిలర్ బడాల సుజాత కాలనీవాసులతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం చేరికల సభలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం, చేస్తున్న అభివృద్ధి పట్ల ప్రతి వార్డులో చర్చలు జరగాలని సూచించారు. సీఎం కేసీఆర్ చెప్పని పథకాలను సైతం చేసి చూపిస్తుంటే చెప్పిన పథకాలను అమలుపరచకుండా బీజేపీ ప్రజలను మోసం చేస్తుందన్నారు. ప్రజలు ప్రభుత్వానికి చెల్లిస్తున్న పన్నులను తిరిగి సంక్షేమ పథకాల రూపంలో జనానికి అందిస్తున్న ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం మాత్రమేనని అన్నారు. ప్రభుత్వ భూముల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తి చేస్తామని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి, రాజకీయ పబ్బం గడుపుతోందని దుయ్యబట్టారు. సీఎం కేసీఆర్ హయాంలో రైతుబంధు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, అమ్మఒడి, గృహలక్ష్మి వంటి సంక్షేమ పథకాలను కులాలకు అతీతంగా అందజేస్తున్నారని అన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాలలో ఈ పథకాలను ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. దేశమంతా బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆదరిస్తూ సంక్షేమ పథకాల అవసరాన్ని గుర్తిస్తుంటే, బీజేపీ మాత్రం ఎక్కడ ఉనికిని కోల్పోతామోనని భయంతో కవితపై లేనిపోని ఆరోపణలు చేస్తూ, ఈడీ రైడ్లు చేయిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ భోజారెడ్డి, మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, వార్డ్ కౌన్సిలర్ బడాల సుజాత, రోకండ్ల రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, పట్టణ అధ్యక్షులు అజయ్, అశ్రాఫ్, బండారి సతీష్, నాయకులు జోగు మహేందర్, బడాల సృజన్, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

కల్తీ కల్లు తాగి మృతి చెందిన గిరిజన కుటుంబాన్ని ప్రభుత్వం, కల్తీ కల్లు విక్రయించిన నిందితుడు ఆదుకోవాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్ రావ్ డిమాండ్ చేశారు. ఇటీవల మండలంలోని సుద్దగూడ గ్రామానికి చెందిన ఆత్రం మోహపత్ రావ్ కల్తీకల్లు తాగి మృతిచెందన విషయం తెలిసిందే. కాగా ఆదివారం మానవ హక్కుల వేదిక బృందం సభ్యులు నిజా నిర్ధారణ కోసం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అక్కడి నుండి కల్తీకల్లు విక్రయించిన కిష్టగౌడ్ నివాసాన్ని పరిశీలించారు. కల్తీ కల్లులో ప్రమాదకర రసాయనిక పదార్థాలు వినియోగిస్తున్నట్లు తమ నిజ నిర్ధారణలో తేలిందని అన్నారు. అక్కడి నుంచి ఎక్సైజ్ కార్యాలయానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో కల్తీకల్లు ఏరులై పారుతుందని, సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేకనే అనేక మంది మృతి చెందారని అన్నారు. ఐటీడీఏ కేంద్ర బిందువు అయిన ఉట్నూర్ కేంద్రంగా అక్రమంగా డబ్బులు సంపాదించాలని ఆశతో తాటి కల్లులో మనుషులకు హాని కలిగించే ప్రమాదకర రసాయనాలు వాడుతూ కల్లు అమ్ముతున్నా, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరైంది కాదని అన్నారు. వారి వద్ద వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కల్తీకల్లును నివారించి ఉంటే గిరిజన యువకుడు మృతి చెందే అస్కారం ఉండేది కాదని కుటుంబానికి పుత్రశోకం మిగిల్చేది కాదన్నారు. దీనికి కారణమైన ప్రభుత్వం, కల్తీకల్లు విక్రయించిన నిందితుడు, కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక సభ్యులు ఆత్రం సుగుణ, శ్యామ్ రావ్, జంగు, గోపీనాథ్ ఉన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి లోనుకావద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ, ఉన్నత స్థాయికి ఎదగాలని రిటైర్డ్ లెక్చరర్ విజయ్ బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని గజిటెడ్ నెంబర్.1 ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల కోసం, శ్రీ సరస్వతి శిశుమందిర్ 1992-93 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు విజయబాబు మాట్లాడుతూ కెరీర్ గైడెన్స్ అంశానికి చాలా ప్రాధాన్యత ఉందన్నారు. ఏ కోర్సులు చదవాలో తెలియక విద్యార్థులు ఒత్తిడికి లోనవుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా పదో తరగతి నుంచే విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి వారికి సరియైన మార్గాన్ని చూపినట్లయితే వారు రాణిస్తారని అన్నారు. పేరెంట్స్ తమ ఇష్టాన్ని విద్యార్థులపై రుద్దవద్దని సూచించారు. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మహేందర్, జైపాల్‌రెడ్డి, నాగేష్, రాకేష్, జేకే కిరణ్ పాల్గొన్నారు.

'బండి సంజయ్ వ్యాఖ్యలు సరికావు'

నవతెలంగాణ-ఇచ్చోడ

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికావని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం బీజేపీ కక్ష్యపూరిత చర్యలను నిరసిస్తూ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డుపై బైటాయించి, కేంద్ర ప్రభుత్వంపై, బండి సంజయ్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మాట్లాడుతూ బీజేపీ నాయకులు కనీసం స్త్రీల గురించి, మాట్లాడే ముందు విలువలను పాటించాలని అన్నారు, కేంద్రంలో మోడీ మహిళలకు 33శాతం రిజర్వేషన్‌ల బిల్లు ఎందుకు ప్రవేశపెట్టలేకపోతున్నారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ పార్టీ దేశవ్యాప్తంగా విస్తరిస్తోందిని, అది ఓర్వలేక కేంద్రం ప్రభుత్వం, ఈడీ, సీబీఐ లాంటి దర్యాప్తు సంస్థలతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. కేసులకు భయపడే ప్రసక్తి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో 9 మండలలా పార్టీ కన్వీనర్‌లు ఏనుగు కృష్ణా రెడ్డి, రాజారామ్, మండల నాయకులు భాస్కర్, గణేష్, వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదమరిస్తే అంతే మరి..!

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్



పట్టణంలోని విద్యానగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న మురికి కాలువ నిర్మాణం నిలిపి వేయడంతో ప్రమాదకరంగా మారింది. అసంపూర్తిగా నిర్మాణం చేపట్టిన మురికి కాలువతో పాదచారులు, వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీ వాసులు ప్రధానంగా వినియోగించుకునే ఈ దారిలో ప్రమాదకరంగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏమాత్రం అలసత్వం వహించినా, ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని, స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు ప్రమాదకరంగా ఉన్న మురికి కాలువ పనులు పూర్తి చేసి, ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగులకు ఆర్టీసీ ప్రత్యేక రాయితీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఈ నెల 13న దివ్యాంగుల కోసం ప్రత్యేక రాయితీ బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని డిపో మేనేజర్ కల్పన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.50 కార్డు రుసుముతో పాటు అన్ని ధృవీకరణ పత్రాలు, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, తీసుకురావాలని అన్నారు. దివ్యాంగులు అందరూ ఇట్టి అవకాశాన్ని వినియోగించుకొని రాయితీ బస్సు పాస్ పొందాలని సూచించారు.

బాసర ఆలయంలో ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-బాసర

సరస్వతి దేవి అమ్మవారిని ఆదివారం ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న వీరిని ఆలయ అధికారులు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక కుంకుమార్చన పూజలు జరిపించి, హారతినిచ్చి ఆశీర్వదించారు. ఆలయ ఈఓ విజయరామారావు శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

ఆర్టీసీ డిపోలో ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

వేసవి కాలం నేపథ్యంలో ఎండ తీవ్రతను తట్టుకునేందుకు ప్రతిరోజు మధ్యాహ్నం ఆర్టీసీ ఉద్యోగులకు ఎండి వీసీ సజ్జనార్ ఆదేశాల మేరకు మజ్జిగ పంపిణీ చేయనున్నట్టు డీఎం కల్పన తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం ఆదిలాబాద్ డిపోలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని డిపో మేనేజర్ కల్పన, అసిస్టెంట్ మేనేజర్ (మెకానికల్) రాజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లను అందించారు. కార్యక్రమం ప్రతిరోజు మధ్యాహ్నం ఒంటి గంటలకు ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నారు.